# సుబ్బంతి దేవుడు

'సంపదలు గల్గుతిరి మహాజనుల హృదయ
మభినవోత్పల కోమలం బగుచు వెలయు
నాపదలు పొందునపుడు మహా మహీధ
రాశ్మ సంఘాత కర్కశంబై తనర్చు - భర్తృహరి

పనిమీద నంద్యాల వెళ్లి ఓ మధ్యాహ్నం మా శివుడి బ్రాందీషాపులో రెడ్డి కోసం కాచుక్కూచున్నప్పుడు, ఓ వ్యక్తి సైకిలుకు రెండు పెద్ద యూరియా సంచులు తగిలించుకొని వచ్చాడు. ఆ సంచుల్లోంచి చిన్న పాలథీన్ కవర్లలో ప్యాక్ చేసిన మురుకులు (జంతికలు), మిక్చర్ తీసి కౌంటర్మీద పెట్టి, దానికి సరిపడా డబ్బు తీసుకుని వెళ్తూ వెళ్తూ నన్ను చూసి... ఆగి, నా పేరుతోటి నన్ను పిలిచాడు. అద్దపంచె, మాసిన పొడుగుచేతుల చొక్కా భుజమ్మీదో తువ్వాలూ పూర్తిగా నెరిసిన తలా, మాసిన గడ్డం... అతన్నెక్కడో చూసిన గుర్తు లీలగా వుంది కానీ ఇదమిత్థంగా పోల్చుకోలేకపోయాను. తిరిగి అతనే అన్నాడు 'నేనూ సుబ్బారావుని' అని.

ఎక్కడ సుబ్బారావు?! ఒక్కసారిగా గబగబా కాలాన్ని మెదడులో రీవైండ్ చేసాను.

అరవై దశకపు పూర్వార్థంలో నేను లాగులలో వున్నప్పుడు సుబ్బారావు పరిచయం... పరిచయమయ్యే సమయానికి సుబ్బారావుకు తల్లీ తండ్రీ లేరు. మేనత్త దగ్గర వుండేవాడు. మగపిల్లలు లేని ఆమె సుబ్బారావుని పెంచుకుంది. మంచి ఆస్తిపరులు. అప్పట్లో ఆమె వంటిమీద నగలు చుట్టుపక్కల ఆడవాళ్లకు చర్చనీయాంశం. సుబ్బారావుని చాలా ప్రేమగా చూసుకునేదావిడ. అప్పట్లోనే సుబ్బారావు పాకెట్‌మనీ చాలా వుండేది. ఆ రోజుల్లో చైనా యుద్ధం సందర్భంగా రెడ్‌క్రాస్ వాళ్లకి సుబ్బారావు అయిదు రూపాయలు ఇవ్వడం నాకు గుర్తుంది.

సుబ్బారావు అమాయకుడిలా కనిపించే ఓ మంచివాడు. రంతి దేవుడిలాంటి వాడు. తన దగ్గర ఏముంటే అది చుట్టూ వున్నవాళ్ళకి పంచేవాడు. ఒక్కోసారి తనకు మిగుల్చుకోకుండా మరీ పంచేసేవాడు.

అత్త చేసిన గారాబమో అతనికి సహజంగా వున్న చదువు పట్ల అనాసక్తతో ఏమోగానీ సుబ్బారావుకు చదువబ్బలేదు.

చదువు మనిషితనానికి కొలబద్ద కానేకాదు అనడానికి సుబ్బారావే నిదర్శనం. అతని మంచితనాన్ని చాలామంది వెంగళాయితనంగా భావించి నిరసించి హేళన చేసే

వారు. కానీ అతను అవేమీ పట్టించుకునేవాడు కాదు. హైస్కూలు వరకు ఎట్లాగో నెట్టుకు వచ్చి ఆ తర్వాత ఆపేసాడు. అతని అత్తకూడా "మనకు చదువులెందుకు లేరా సుబ్బా వున్నది నిలబెట్టుకుంటే చాలు మూడుతరాలు వస్తుంది" అనేసింది.

నాకు గుర్తుండీ సుబ్బారావుకు 75లో వివాహమయ్యింది. అప్పుడు ఒకరిద్దరు దుర్మార్గులు కూసిన అప్రాచ్యపు కూతలు నాకిప్పటికీ గుర్తున్నాయి. "వీడికెందుకూ పెళ్లి... ఎవడైనా వచ్చి నాకు పెళ్లాం లేదు అనంటే యిదో నా పెళ్లాన్ని తీసికెళ్లు అనంటాడు' అని సుబ్బారావు మంచితనాన్ని అపహాస్యం చేసిన ముళ్ళ, మురికి మాటలవి.

ఆ సుబ్బారావు ఈరోజు ఇట్లా నంద్యాల్లో బ్రాందీషాపులో మిక్సర్ పొట్లాలమ్ముతూ ... నాకంటే పదేళ్లు పెద్దవాడిలా కనిపిస్తున్నాడు. పైగా కొట్టొచ్చినట్టు కనిపిస్తూన్న దారిద్ర్యం. 'బాగున్నావా సుబ్బా" ఆప్యాయంగా అడిగా.

"పద చాలా ఏళ్లకు కలిసావు. నీ గురించి అప్పుడప్పుడూ వింటున్నాను. మొన్న ఈమధ్య నీ పుస్తకానికి దేనికో అమెరికా వాళ్లు లక్షరూపాయలిచ్చినారంట కదా... చాలా సంతోషమేసింది. పద ఇంటికి పోదాం" అన్నాడు ఆప్యాయంగా.

ఇల్లనబడే ఓ రెండు గదుల ఇరుకు పోర్షన్‌కు తీసుకెళ్లాడు.

భార్యనూ ఇద్దరు కూతుళ్లనూ పరిచయం చేసాడు. పెద్దమ్మాయి కాన్పుకెళ్లిందనీ, అత్తయ్య చనిపోయి పదిహేనేళ్లైందనీ చెప్పాడు.

అతని మరీ మంచితనం వల్ల ఆస్తి హరించుకుపోయింది. చిన్నతనంలోనే వివాహం వల్ల ముగ్గురు కూతుళ్లు. కుటుంబాన్ని పోషించుకోడానికి ఆడపిల్లల పెళ్లికీ ఏదో ఉపాధి కావాలి కదా... ఇంట్లో భార్యా కూతుళ్లు చిరుతిళ్లు చేస్తే ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్చేసి, చిన్న చిన్న దుకాణాలూ, బ్రాందీషాపుల్లోనూ అమ్ముతున్నానని చెప్పాడు. బాగానే ఉంది ఫర్వాలేదనే చెప్పాడు. చిన్న కూతురు ఓ స్టీలు గ్లాసులో మజ్జిగ తెచ్చిచ్చింది. సుబ్బారావు మనసులా చల్లగా ఉందది.

నేనూ సుబ్బారావూ గతించిన కాలాన్ని మననం చేసుకుంటూంటే, అతని భార్య 'అన్నాలు వడిస్తున్నా లేవండి' అంది. కాళ్లు కడుక్కొచ్చేసరికి సుబ్బారావు భుజమ్మీద తువ్వాలిచ్చాడు. అన్నాలకు కూచున్నాం.

అక్కడ విస్తట్లో ఆదరువులు ఏమీ లేవు. ఓ చిన్న ప్లేట్లో మిక్సర్, ఓ పచ్చడి, పల్చటి మజ్జిగ అంతే. సుబ్బారావు వేపు ఓసారి చూసాను. చిన్నప్పటి సుబ్బారావే కన్పించాడు. అదే నైర్మల్యం, అదే మానవీయదృష్టి.

తనేం పెడుతున్నాడో సుబ్బారావు ఏనాడూ చూడలేదు.

ఈనాడూ అంతే, తనకున్న దాన్ని, అది పచ్చడి మెతుకైనా దాన్ని ఆత్మీయత, ప్రేమతో కలిపి పెట్టటమే అతనికి తెలుసు. కడుపారా భోంచేసాను. సుబ్బారావు లాంటి వాళ్లను కష్టాలూ దారిద్ర్యం బాధించలేవని తెలుసుకున్నాను. ●